# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

శనివారం 13, సెప్టెంబర్ 2025




# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

**✱ కలెక్టర్ వెంకటేష్ ధోత్రే**

**తిర్యాని, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త**

ప్రభుత్వ వైద్యశాలలకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శుక్రవారం తిర్యాని మండలం గిన్నెధరి గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి వైద్యశాలలోని వార్డులు, రిజిస్టర్లు, మందుల నిల్వలు, పరిసరాలను పరిశీలించి ఆసుపత్రికి వచ్చే ప్రజల వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలలకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అవసరమైన మందుల నిల్వలను అందుబాటులో ఉంచుకోవాలని, వైద్యశాల పరిసరాలు శుభ్రంగా ఉంచాలని, చికిత్స కోసం ఆసుపత్రికి వచ్చే ప్రజల పట్ల మర్యాదగా వ్యవహరించాలని పేర్కొన్నారు. అవసరమైన వారికి రక్త పరీక్షలు నిర్వహించాలని, విష జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులకు సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. అనంతరం గ్రామంలో గల గిన్నెధరి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించి విద్యార్థుల హాజరు శాతం, తరగతి గదులు, బోధన పద్ధతులు, మధ్యాహ్న భోజన నాణ్యత అంశాలను పరిశీలించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో నాణ్యమైన విద్యాబోధన అందించాలని, పదవ తరగతి విద్యార్థులకు గణితం, సైన్స్, ఇంగ్లీష్ సబ్జెక్టులను ప్రత్యేకంగా బోధించాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులు పాఠశాలకు గైర్హాజరు కాకుండా విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడాలని, క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఆశ్రమ పాఠశాలలలో గల పాత వస్తువులను తొలగించాలని, పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలను తొలగించాలని, పాఠశాల మిగతా 2లో..

# నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

**★ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**బెల్లంపల్లి, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త**

కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం పరిధిలో చేపట్టిన నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని బెల్లంపల్లి మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం పరిధిలో చేపట్టిన అదనపు గదులు, పాఠశాలలో చేపట్టిన మూత్రశాలల నిర్మాణ పనులను మండల పరిషత్ అభివృద్ధి అధికారి మహేందర్, డి.ఈ.యు.యు.ఐ.డి.సి. ఎ.ఈ. వినయ్ కుమార్‌లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ అన్ని ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ క్రమంలో ప్రభుత్వ పాఠశాలల పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులతో మాట్లాడి పాఠశాలలో వారికి కల్పిస్తున్న సౌకర్యాలు, మధ్యాహ్న భోజన వివరాలను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం అయినందున విద్యార్థులకు ఎలాంటి సీజనల్ వ్యాధులు, ఎలర్జీ ఇతర లక్షణాలు కనిపించినట్లయితే వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులను సంప్రదించి వైద్య సేవలు అందించాలని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మెనూ ప్రకారం మిగతా 2లో..



# ఆశయాన్ని నిర్దేశించుకుని పట్టుదలతో సాధించడం అభినందనీయం



**● బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్**

**బెల్లంపల్లి, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త**

విద్యార్థి స్థాయి నుండి ఉన్నత ఆశయాన్ని నిర్దేశించుకుని పట్టుదలతో సాధించడం అభినందనీయమని బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ అన్నారు. శుక్రవారం బెల్లంపల్లిలోని ప్రభుత్వ వెనుకబడిన తరగతుల కళాశాల, బాలుర వసతి గృహంలో గతంలో విద్యను అభ్యసించి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన పూర్వ విద్యార్థులను జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి పురుషోత్తం నాయక్ తో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ వెనుకబడిన తరగతుల కళాశాల, సంక్షేమ వసతి గృహంలో విద్య అభ్యసించిన పూర్వ విద్యార్థులు చిన్నతనంలోనే ఆశయాన్ని నిర్దేశించుకుని పట్టుదలతో ప్రయత్నించి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం అభినందనీయమని అన్నారు. విద్యార్థులు కళాశాల సమయంలో ఉన్నత ఉద్యోగాలలో పని చేస్తూ ప్రజలకు సేవలు అందిస్తున్న అధికారులను పూర్తిగా తీసుకోవాలని తెలిపారు. పూర్వ విద్యార్థులైన సన్మాన గ్రహీతలను ఆదర్శంగా తీసుకుని జీవితంలో ఉన్నత స్థానానికి ఎదిగేందుకు విద్యార్థులు ఏకాగ్రతతో విద్య అభ్యసించాలని తెలిపారు. అనంతరం ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన పూర్వ విద్యార్థులు జి. విలాస్ (టీచర్), సిహెచ్. రాజన్న (కానిస్టేబుల్), జి. ప్రదీప్ (కానిస్టేబుల్), జి. వెంకట స్వామి (కానిస్టేబుల్), డి శ్రీకాంత్ (కానిస్టేబుల్), సిహెచ్. శ్రీనివాస్ (కానిస్టేబుల్), డి.సుగుణాకర్ (జూనియర్ అసిస్టెంట్), వి.వికాస్ (జూనియర్ లైన్మెన్), ఏ.సాయి కృష్ణ (జూనియర్ లైన్మెన్) లను సత్కరించారు.ఈ కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమ అధికారి జి. వెంకటేశం, వసతి గృహ సంక్షేమ అధికారిని సరిత, వసతి గృహ అధికారులు శ్రీనివాస్, రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

# సంక్షేమ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి




**✳ ఆసిఫాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి**

**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త**

ఆసిఫాబాద్ జిల్లాలో చేపట్టిన సంక్షేమ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లాలోని అన్ని మండలాల మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులు, ఉపాధి హామీ పథకం ఏపిఓలు, సెర్ప్ ఏపిఎంలు, హౌసింగ్ శాఖ అధికారులతో పాఠశాలలలో చేపట్టవలసిన మౌలిక వసతుల కల్పన, మొక్కల పెంపకం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, ఎన్నికల సంబంధిత అంశాలు, గ్రామపంచాయతీలలో పారిశుద్ధం, త్రాగునీరు ఇతర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలలో మౌలిక వసతుల కల్పన, త్రాగునీరు, మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణాలు, ఏకరూప దుస్తుల పంపిణీ ఇతర పనులను త్వరగా చేపట్టాలని ఇంజనీరింగ్, విద్యాశాఖ అధికారులను ఆదేశించి పనులను పర్యవేక్షించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల సౌకర్యార్థం సకల సదుపాయాలు కల్పించే దిశగా చర్యలు తీసుకోవడం మిగతా 2లో..

## ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

*(మొదటిపేజీ తరువాయి)*

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు.పాఠశాలలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని సందర్శించి విద్యార్థినులకు ఆరోగ్య సమస్యలను పరీక్షించి అవసరమైన మందులు అందజేయాలని తెలిపారు. అనంతరం విద్యార్థినులకు ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాస్, ఎంపిడిఓ మల్లేష్, ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణారావు, వైద్యులు, ఉపాధ్యాయులు,సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

## సంక్షేమ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

*(మొదటిపేజీ తరువాయి)*

జరుగుతుందని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని తెలిపారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా శాఖల వారీగా మొక్కలు నాటేందుకు నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని తెలిపారు. ప్రస్తుతం మొక్కలు నాటేందుకు వర్షాలు అనుకూలంగా ఉన్నాయని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పనులు 100 శాతం మొదలు పెట్టాలని, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మహిళా సంఘాల నుండి రుణాలు అందించాలని, ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఉచితంగా ఇసుకను అందిస్తుందని తెలిపారు. గ్రామపంచాయతీలలో పారిశుధ్య కార్యక్రమాలు నిరంతరం చేపట్టాలని, వర్షపు నీటి నిలువ లేకుండా గుంతలను పూడ్చాలని, దోమల వృద్ధిని అరికట్టే చర్యలలో భాగంగా ఆయిల్ బాల్స్, బ్లీచింగ్ పౌడర్, దోమల మందు పిచికారి చేయించాలని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులలో వేగం పెంచాలని, త్వరగా పూర్తిచేసే విధంగా సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి నదీమ్, మండల విద్యాధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

*(మొదటిపేజీ తరువాయి)*

సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని తెలిపారు. మధ్యాహ్న భోజన తయారీ సమయంలో తాజా కూరగాయలు, నిత్యావసర సరుకులను వినియోగించాలని, వంట సిబ్బంది శుభ్రత నిబంధనలు పాటించాలని తెలిపారు. వర్షాకాలం అయినందున పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, వంటశాల ప్రాంతాలలో పరిశుభ్రత పాటించాలని, వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం రామ్ నగర్ ప్రాంతంలో చేపట్టిన మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బంబారా గ్రామంలో పోలీస్ కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం

వాంకిడి, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త

వాంకిడి మండలంలోని బంబారా గ్రామంలో సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం పోలీస్ కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ తనిఖీలలో సరైన పత్రాలు లేని 32 ద్విచక్ర వాహనాలు, స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. గ్రామంలో ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు కనపడితే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. గంజాయి, గుడుంబా, రేషన్ సరఫరా వంటివి తమ దృష్టికి వస్తే వెంటనే డయల్ 100 ను సంప్రదించాలని, లేదా నేరుగా స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వాంకిడి ఎస్సై.మహేందర్, కెరెమేరి ఎస్సై.మధుకర్, 20 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# ఓపెన్ ఎస్ఎస్‌సి, ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

**- ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే**

ఆసిఫాబాద్, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త



తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో జరుగనున్న ఓపెన్ ఎస్. ఎస్. సి. , ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు తో కలిసి పోలీస్, రెవెన్యూ, వైద్య ఆరోగ్య, విద్య, ఖజానా, తపాలా, పురపాలక, విద్యుత్, పంచాయితీ రాజ్ శాఖల అధికారులతో పరీక్షల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఓపెన్ ఎస్. ఎస్. సి. , ఇంటర్ పరీక్షల నిర్వహణకు తగు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఓపెన్ ఎస్. ఎస్. సి. పరీక్ష నిర్వహణ కొరకు జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, ఓపెన్ ఇంటర్ కొరకు జనకాపూర్ లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఓపెన్ 10వ తరగతి కొరకు 145 మంది అభ్యర్థులు, ఓపెన్ ఇంటర్ కొరకు 63 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరవుతారని, ఈ నెల 22 నుండి 28వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఓపెన్ 10వ తరగతి పరీక్షలు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఓపెన్ ఇంటర్ పరీక్షలు మధ్యాహ్నం 2.30 గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తూ సమీపంలోని జిరాక్స్ సెంటర్ లను మూసి ఉంచాలని, పరీక్షా కేంద్రాలలో ఫర్నిచర్, విద్యుత్ సరఫరా, పారిశుద్ధ్య పనులు చేపట్టాలని తెలిపారు. పరీక్షా కేంద్రాలలో వైద్య సిబ్బంది అవసరమైన మందులతో అందుబాటులో ఉండాలని, పరీక్ష సమయానికి అనుగుణంగా ఆర్. టి. సి. అధికారులు బస్సులను నడిపించాలని, తపాలా శాఖ ఆధ్వర్యంలో జవాబు పత్రాలను తరలించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, ప్రశ్నాపత్రాలు, జవాబు పత్రాలను స్థానిక పోలీస్ స్టేషన్లలో భద్రపరచాలని తెలిపారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరీక్షల కమిషనర్ ఉదయ్ బాబు, విద్యుత్ శాఖ ఎస్. ఈ. శేషరావు, పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, వైద్య, మిషన్ భగీరథ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 15న మంచిర్యాల రైల్వే స్టేషన్‌లో వందే భారత్ రైలు ప్రారంభం

**– మంచిర్యాల చీఫ్ కమర్షియల్ ఇన్స్‌పెక్టర్ ఎన్. దేవేందర్**

నస్పూర్, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త

కేంద్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఈ నెల 15న మంచిర్యాల రైల్వే స్టేషన్‌లో కేంద్ర హోమ్ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చేతుల మీదుగా వందే భారత్ రైలు ప్రారంభించడం జరుగుతుందని దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజన్ మంచిర్యాల చీఫ్ కమర్షియల్ ఇన్స్పెక్టర్ ఎన్. దేవేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15న ఉదయం 8.15 గంటలకు మంచిర్యాల రైల్వే స్టేషన్ లో వందే భారత్ (20101) నాగ్‌పూర్ సికింద్రాబాద్ రైలును జెండా ఊపి ప్రారంభించడం జరుగుతుందని, అధికారులు, ప్రజలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సబ్ కలెక్టర్ మనోజ్

## బెల్లంపల్లి సబ్ కలెక్టర్ చేతుల మీదుగా ఫోటో ట్రేడ్ ఎక్స్పో పోస్టర్ ఆవిష్కరణ

బెల్లంపల్లి, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త:


బెల్లంపల్లి ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం రోజున బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ చేతుల మీదుగా ఫోటో ట్రేడ్ ఎక్స్పో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ, ఈ నెల 19, 20, 21 తేదీలలో హైదరాబాద్ నార్సింగ్‌లోని ఓం కన్వెన్షన్ హాల్‌లో జరుగనున్న ఎక్స్పో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఫోటోగ్రఫీ ఒక సృజనాత్మకత పూర్తిగా మారిందని ఇటువంటి ఎక్స్పోలుకు కొత్త పరికరాలు డిజిటల్ టెక్నాలజీలు ప్రజలకు చేరువ కాలంలో దోహద పడుతాయని తెలిపారు. యువత ఈ రంగాన్ని వృత్తిగా ఎంచుకోవడం ద్వారా మంచి అవకాశాలను పొందగలరని సూచించారు. ఫోటోగ్రఫీ రంగం ఇప్పుడు రానున్న టెక్నాలజీ కూడా ఫోటోగ్రాఫర్లు వాడుకోవాలని ఎక్స్పోలో కెమెరాలు, లెన్స్, డ్రోన్లు ప్రింటింగ్ పరికరాలు లైటింగ్ సిస్టం ఫోటో ఎడిటింగ్ సాఫ్ట్వేర్లు స్టూడియో మోడల్స్ ప్రదర్శించినట్లు తెలిపారు. బెల్లంపల్లి నియోజకవర్గం లోని ఫోటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు, ప్రొఫెషనల్ స్టూడియోలు ఆసక్తిగల యువత తప్పక పాల్గొని ప్రయోజనకం పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లాప్రధాన కార్యదర్శి శ్వాస తిరుపతి, జిల్లా కోశాధికారి ముక్కెర శ్రీనివాస్, బెల్లంపల్లి అసోసియేషన్ అధ్యక్షులు కుంభాల రాజేష్, అధ్యక్షులు ఆకుల వేణు, ప్రధాన కార్యదర్శికంపెల్లి విజయ్, కోశాధికారి మడుపు విక్రమ్, జిల్లా మాజీ కార్యదర్శులు కాంపెల్లి శంకర్ బాబు, ఆకునూరి రాజ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి పోతారవేణి తిరుపతి, కోశాధికారి ముక్కెర శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలి

**- ఆర్జేడీ సత్యనారాయణ రెడ్డి**

లక్షెట్టిపేట, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త

విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని పాఠశాల విద్యా రీజినల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్జెడీ ) సత్యనారాయణ రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల హాజరు శాతం పెంచడంతో పాటు వారి ప్రగతి విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ముఖ్యంగా నేటి మార్పులకు అనుగుణంగా టీచర్స్ నూతన పద్ధతుల ద్వారా బోధన చేయాలన్నారు. విద్యార్థులలో సృజనాత్మకతను పెంచేలా బోధన ఉండాలన్నారు. బయో సైన్స్ మీటింగ్ గురించి పలు విషయాలపై చర్చించారు. అనంతరం భవిత సెంటర్ ను, ప్రైమరీ స్కూల్ లను సందర్శించారు. ఇటీవల హై కోర్ట్ తీర్పు ప్రకారం, విద్యార్థుల మధ్యాహ్న భోజన విషయంలో కూడా ప్రధానోపాధ్యాయులు శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి జీ. శైలజ, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# కార్మికులు అండగా ఉంటే సొంతింటి కల నెరవేరుస్తాం

## సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి - నస్పూర్ ప్రెస్‌క్లబ్‌లో ఓట్లు లెక్కించిన సీఐటీయూ నాయకులు

**నస్పూర్, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త**

సింగరేణి కార్మికులు తమకు అండగా ఉంటే సొంతింటి కల నెరవేరుస్తామని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి అన్నారు. శుక్రవారం నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి మాట్లాడుతూ, కార్మికుల సొంతింటి కల సాకారం కోసం గత మూడు సంవత్సరాలుగా పోరాటం చేస్తున్నామని, ఆమరణ నిరాహార దీక్షకు సైతం సిద్ధపడినట్లు, సింగరేణి కార్మికుల సొంత ఇంటి కల సాకారం కావడానికి కార్మికుల ఐక్యత ముఖ్యమని, కార్మికులు అండగా ఉంటే సొంతింటి కల నెరవేర్చుకోవచ్చని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో సైతం పలువురు రాజకీయ నాయకులు మేనిఫెస్టోలో సొంతింటి పథకాన్ని చేర్చారని, ఎన్నికల అనంతరం విస్మరించారని,




సింగరేణి గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రాష్ట్ర ముఖ్యమంత్రితో పాటు అన్ని ఏరియాల జీఎంలకు వినతి పత్రాలు అందజేసినట్లు తెలిపారు. కార్మికులను ఏకం చేయడానికి ఈనెల 11, 12 తేదీల్లో ఓటింగ్ ద్వారా అభిప్రాయం తెలపాలని బ్యాలెట్ బాక్సులను ఏర్పాటు చేయగా యూనియన్లకు అతీతంగా కార్మికులు తమ అభిప్రాయాలు తెలిపారని చెప్పారు. నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో బ్యాలెట్ బాక్సులు తెరిచి ఓట్లు లెక్కించగా 4543 మంది కార్మికులు సొంతిల్లు కావాలని, 31 మంది కార్మికులు సింగరేణి క్వాటర్ కావాలని ఆకాంక్షించినట్లు తెలిపారు. వర్షం కారణంగా ఆటంకాలు ఎదురయ్యాయని, కొన్ని కార్మిక సంఘాలు ఆటంకాలు కలిగించడంతో గనులకు దూరంగా అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించామని, కార్మికులు ఇచ్చిన స్ఫూర్తితో భవిష్యత్తులో సొంతిల్లు సాధించే వరకు పోరాటం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ సెక్రటరీ గుల్ల బాలాజీ, బ్రాంచ్ నాయకులు వెంగళ శ్రీనివాస్, తోడే సుధాకర్, పెరుక సదానందం, శ్రీధర్, సాయిల్ల శ్రీనివాస్, ఇత్తినేని వెంకటేష్, కేసిపెద్ది శ్రీనివాస్, కిషన్ రెడ్డి, శ్రీపతి బానేష్, నవీన్, వెంకట్ రెడ్డి, డివైఎఫ్ఐ నాయకులు మిడివెల్లి రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా మిలాద్‌ఉన్‌నబీ వేడుకలు

**కాగజ్‌నగర్, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త**

ముస్లీం సోదరులు మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని దైవ ఘట్టంగా జరుపుకుని ఆయన పట్ల ప్రేమను, భక్తిని చాటుకున్నారు. ఇస్లాం మతంలో ఈద్ మిలాద్ ఉన్ నబీ పండుగకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఇస్లాం మతాన్ని స్థాపించిన చివరి మహ్మద్ ప్రవక్త పుట్టిన రోజునే ఈద్ మిలాద్ ఉన్ నబీ పండుగను జరుపుకుంటారు. కాగజ్ నగర్ పట్టణంలో ముస్లీం సోదరులు మిలాద్ ఉన్ నబీ సందర్భంగా శుక్రవారం ఘనంగా ర్యాలీ (జులుస్) నిర్వహించారు. ముందుగా జామియా మజీద్లో ప్రత్యేక ప్రార్ధనలు చేసిన అనంతరం ర్యాలీని మిలాద్ ఉన్ నబీ అడక్ కమిటీ ఆధ్వర్యంలో జామియా మజీద్ ఇమామ్, కమిటీ సభ్యులు ప్రారంభించారు. ఈ ర్యాలీ జామియా మజీద్ నుండి రాజీవ్ గాంధీ చౌరస్తా, అంబేద్కర్ చౌరస్తా, లారీ చౌరస్తా, ఎన్టీఆర్ చౌరస్తా, బస్టాండ్, ఓల్డ్ కాలనీ, సర్స్కిల్ నుండి తిరిగి జామియా మజీద్ వరకు చేరుకుంది. ప్రత్యేకంగా వాహనాలను అలంకరించి భక్తిశ్రద్ధలతో ర్యాలీనిర్వహించారు. ఈ సందర్భంగా మహమ్మద్ ప్రవక్త పుట్టినరోజు సందర్భంగా అందరూ శాంతియుతంగా ఉండాలని నినాదంతో ఐకమత్యంతో కలిసి ర్యాలీ తీసే వారికి మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆధ్వర్యంలో అరటి పండ్లు, మంచినీళ్లు, లస్సి, మజ్జిక, పంపిణీ చేశారు. బీఆర్ఎస్, బీఎస్పి, కాంగ్రెస్తో పాటు వివిధ సంస్థల ఆధ్వర్యంలో స్వీట్లు, జ్యూస్, పండ్లు, మంచినీళ్ల బాటిళ్లు పంపిణి చేశారు. కాగజ్‌నగర్ డిఎస్పి వహీద్ ఉద్దీన్ ఆధ్వర్యంలో పోలీస్ అధికారులు, పోలీస్ సిబ్బంది భారీ బందోబస్తు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మహ్మద్ ప్రవక్త జన్మదినం పురస్కరించుకుని ముస్లీం సోదరులందరూ భక్తిశ్రద్ధలతో ఉంటూ సేవ కార్యక్రమాలు చేపట్టడం సంతోషరమని, ప్రతీ ఒక్కరు మహ్మద్ ప్రవక్త అడుగుజాడల్లో నడవాలని వారన్నారు. ఈ కార్యక్రమంలో మజీద్‌ల ఇమాములు, మత పెద్దలు, ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర పర్యావరణ శాఖ అధికారి పర్యటన

**బెల్లంపల్లి, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త**

మొక్కలు నాటి వాటిని పరిరక్షించడంలో సింగరేణి ఇతర రంగాలకు ఆదర్శంగా నిలుస్తోందని తద్వారా పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తోందని మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్మెంట్ ఫారెస్ట్ అండ్ క్లైమెట్ ఛేంజ్ సైంటిస్ట్, అడ్వైజర్ తరుణ్ కుమార్ అన్నారు. శుక్రవారం బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం. విజయభాస్కర్ రెడ్డి, ఎన్విరాన్మెంట్ జీఎం (కార్పొరేట్) బి. సైదులుతో కలిసి ఏరియాలో పర్యటించారు. బిపిఎ ఓసి ఎక్స్ టెన్షన్, మూత పడిన గోలేటి1, గోలేటి 1ఎ ఇంక్లైన్ గనులను పర్యావరణ అనుమతుల నేపధ్యంలో నిభందనల ప్రకారం ఉండాల్సిన వసతులను పరిశీలించారు. గోలేటి1, గోలేటి 1ఎ ఇంక్లైన్ మూతబడిన మ్యాన్ వే, ఎయిర్ షాఫ్ట్, గ్రీన్ బెల్ట్, రోడ్డుకు ఇరువైపులా పెరిగిన వృక్షాలను పరిశీలించారు. బిపిఎ ఓసి2 ఎక్స్ టెన్షన్ గని సమీపంలోని సెట్లింగ్ పాండ్, బండరాళ్ల తో నిర్మించిన డ్యాం, గోడలు, దంపులపై పెరిగిన వృక్షాలను, నర్సాపూర్ నాలాలను చూశారు. గోలేటి లోని మురుగు నీటి సుద్ధి కేంద్రాన్ని తనిఖీ చేశారు. అనంతరం జనరల్ మేనేజర్ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థ అన్ని ఏరియాల్లో మొక్కలు నాటుతూ వాటిని పరిరక్షిస్తూ పర్యావరణాన్ని కాపాడుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జిఎం కె. రాజమల్లు, గోలేటి ఓసి పీవో ఎన్ ఉమాకాంత్, ఏరియా సర్వే అధికారి అప్సర్ పాషా, ఏరియా సెక్యూరిటీ అధికారి శ్రీధర్, మేనేజర్ మహేష్, ఎన్విరాన్మెంట్ అధికారి హరీష్, జూనియర్ ఫారెస్ట్ అధికారిణి సుష్మ తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు టై, బెల్టుల పంపిణీ

**కౌటాల,ప్రభాతవార్త, సెప్టెంబర్ 12**

కౌటాల మండలంలోని కౌటి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు హైదరాబాదకు చెందిన కత్తెరసాల జనార్దన్ అనే వ్యక్తి టై, బెల్టు, ఐడి కార్డులను అందించినట్లు పాఠశాల పాద్యాయుడు సాయి కిరణ్ తెలిపారు. పాఠశాలలో చదివే విద్యార్థులు పేద విద్యార్థులని వారికి మెరుగైన విద్య అందిస్తున్నప్పటికీ ప్రయివేటు పాఠశాలల వలే టై, బెల్టు, ఐడి కార్డు ఉండాలనే ద్దేశ్యంతో ఉపాధ్యాయుడు సాయి కిరణ్ దాతల కోసం సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడంతో అతని మిత్రుడు జనార్ధన్ స్పందించి విద్యార్థులకు కావాల్సిన సామాగ్రిని అందించినట్లు ఆయన తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయురాలు వేణి తదితరులు పాల్గొన్నారు.

## సిర్పూర్ నియోజకవర్గానికి 1000 మెట్రిక్ టన్నుల యూరియా

**కాగజ్‌నగర్, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త**

సిర్పూర్ నియోజకవర్గానికి మరో రెండు రోజుల్లో 1000 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అవుతుందని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు రోజులుగా అగ్రికల్చర్ కమిషనర్ డా. గోపితో మాట్లాడి సిర్పూర్ నియోజకవర్గానికి అదనపు యూరియా కేటాయింపులు చేయించడం జరిగిందని అన్నారు. రైతులెవరూ అధైర్య పడవద్దని తెలిపారు. శుక్రవారం మంచిర్యాల రైల్వే స్టేషన్‌కు క్రిబ్ కో యూరియా రైలు వచ్చిన సందర్భంగా రైలు నుంచి ఆన్లోడ్ అవుతున్న యూరియా సరళిని శాసన సభ్యులు డా. పాల్వాయి హరీష్ బాబు పరిశీలించి మంచిర్యాలకు వచ్చిన రైలు ద్వారా 300 మెట్రిక్ టన్నులు, రేపు ఆదిలాబాద్‌కు వచ్చే రైలు ద్వారా 700 మెట్రిక్ టన్నుల యూరియాని సిర్పూర్ నియోజకవర్గానికి కేటాయించడం జరిగిందని తెలిపారు. రేపటి నుండి వివిధ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల ద్వారా వ్యవసాయ అధికారుల పర్యవేక్షణలో రైతులకు యూరియా సరఫరా చేయడం జరుగుతుందని టోకెన్లు పొందిన రైతులకు మొదట యూరియా పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. గుళికల యూరియాతో పాటు నానో యూరియాను కూడా రైతులు ఉపయోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చప్పిడి సంజీవ్, ఎల్కరి బావాజీ, పర్శ బందు, రవితేజ గౌడ్, హరీష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు సరఫరాలో విద్యుత్ అంతరాయం

**వేమనపల్లి, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త**

33కేవీ లైన్ మరమ్మత్తుల కారణంగా నీల్వాయి సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శనివారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు నీల్వాయి, మామడ, కల్మలపేట, కేతనపల్లి, ముల్కలపేట, రాచర్ల, గొర్లపల్లి, కొత్తపల్లి, దస్నాపూర్, మంగనపల్లి, రాజారాం, వేమనపల్లి, ఒడ్డుగూడెం, సుంపుటం, జాజులపేట, ముక్కిడిగూడెం, కల్లంపల్లి గ్రామాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, దీనికి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏఈ దీక్షిత్ తెలిపారు.

## బెల్లంపల్లి మైనారిటీ వెల్ఫేర్ బాలికల వసతి గృహాన్ని సందర్శించిన మున్సిపల్ కమిషనర్

**బెల్లంపల్లి, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త**

బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్ బెల్లంపల్లి మైనార్టీ వెల్ఫేర్ బాలికల వసతి గృహాన్ని సందర్శించారు. ఈ సందర్శనలో భాగంగా హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థులకు కల్పిస్తున్న వసతులను సమీక్షించి, ప్రస్తుత సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ తన్నీరు రమేష్ మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు సమర్థవంతంగా, నాణ్యతతో అందుబాటులో ఉండేలా హాస్టల్ యాజమాన్యం చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, అభ్యాసానికి అనుకూలమైన వాతావరణం ఏర్పాటుకు అవసరమైన సూచనలు చేశారు. తదుపరి హాస్టల్ విద్యార్థులతో కలిసి భోజనం చేయడం ద్వారా వారిలో ఆత్మీయతను పెంపొందించే ప్రయత్నం చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ టి. రమేష్, డిప్యూటీ ఇంజనీర్ బి. సాయి కిరణ్, ఏఈ నిఖిల్, జేఏఓ నాగరాజు, ఇంచార్జి సానిటరీ ఇన్‌స్పెక్టర్ జి. సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## సహాయ నిధి చెక్కులు అందజేత

**బోథ్, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త**

అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తుల చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ఆడే గజేందర్ శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో బోథ్, నేరడిగొండ మండలాలకు చెందిన పద్మావతి, షేక్ హకీమ్, ఆత్రం కామిని బాయ్ లకు 102, 500 రూపాయల విలువగల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## రక్షణతో కూడిన ఉత్పత్తి సాధనకు కృషి చేయాలి

### - శ్రీరాంపూర్ జీఎం మునిగంటి శ్రీనివాస్

**నస్పూర్, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త**




ఉద్యోగులు రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి సాధించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ అన్నారు. శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్. కె న్యూటెక్ గని ఫైవ్ స్టార్ రేటింగ్, 55వ రక్షణ పక్షోత్సవాల్లో ద్వితీయ బహుమతి సాధించిన నేపథ్యంలో శుక్రవారం గనిపై అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై ఉద్యోగులను అభినందించారు. గనిలో పని చేస్తున్న ఉద్యోగుల కృషి, పట్టుదలతో ఆర్. కె న్యూటెక్ గని ఫైవ్ స్టార్ రేటింగ్ సాధించి జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకుందని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ ఆదర్శంగా నిలవాలని సూచించారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏరియా కార్యదర్శి ఎస్. కె బాజీ సైదా, గ్రూప్ ఏజెంట్ కె. రాజేందర్, గని మేనేజర్ కురుపాటి శ్రీనివాసు, పిట్ కార్యదర్శి ఆకుల లక్ష్మణ్, గని రక్షణాధికారి కొట్టె రమేష్, సీనియర్ సంక్షేమాధికారి పాల్ సృజన్, ఇతర అధికారులు, నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## కన్నాల గ్రామపంచాయతీని బెల్లంపల్లి మున్సిపాలిటీలో విలీనం చేయొద్దు

**బెల్లంపల్లి, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త**

కన్నాల గ్రామపంచాయతీని బెల్లంపల్లి మున్సిపాలిటీలో విలీనం చేయొద్దని బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్‌కు వినతిపత్రం అందజేయడం జరిగింది. కన్నాల గ్రామ ప్రజలు 80 శాతం ఉపాధి హామీ 100 రోజుల ప్రభుత్వ పనిపైన ఆధారపడి ఉన్నారు. మున్సిపాలిటీలో విలీనం చేస్తే ఉపాధి హామీ పథకం ఉండదు. పేద ప్రజలకు జీవనోపాధి చాలా ఇబ్బంది అవుతుంది అందువలన మున్సిపాలిటీలో కలపొద్దని కన్నాల గ్రామ ప్రజల కోరిక మేరకు, టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ నాతరీ స్వామి, మాజీ సర్పంచ్ మంద అనిత, యూత్ కాంగ్రెస్ నాయకులు బమండ్లపల్లి భరత్, మాజీ ఉపసర్పంచ్ గోగార్ల రాజేశం, మాజీ ఉపసర్పంచ్ గుండారపు చంద్రమోళి, నాయకులు అసంపల్లి నర్సయ్య, తోకల మల్లేష్, మంతెన కిరణ్ తదితర గ్రామ నాయకులు పాల్గొన్నారు.